# మా పాఠశాల విద్యావిధానం

నేడు విద్యార్థులు విద్యార్జన చేసే పాఠశాలలను ముఖ్యంగ రెండు విధములుగ విభజించ వచ్చును. అవి 1. ప్రభుత్వపాఠశాలలు 2. ప్రభుత్వేతర పాఠశాలలు

ప్రభుత్వపాఠశాలలు ప్రభుత్వ నియమాలకు అనుకూలంగ పనిచేస్తాయి ఆ నియమాలలో శాస్త్రీయత మరియు గతకాల నైతిక విలువలు ఉంటాయి. అయితే అవి ఎంత ఉన్నతంగ ఉంటాయో అనుసరణ అంత అల్పంగ ఉంటుంది. పరుగులు తీసే కాలానికి తగిన విజ్ఞానం ఆ నియమాలలో చోటుచేసుకోవడానికి సమయం అధికంగ పడుతుంది.అందుకే కొందరు మన వెనకతరం విజ్ఞానంగురించి తెలుసుకోవాలంటే, నాటి ప్రభుత్వ పాఠశాలల సిలబస్ చూస్తే సరిపోతుందంటారు. అందుకే ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నానాటికి తగ్గుముఖం పడుతుంది ప్రభుత్వ ఉపాధ్యాయులు సహితం, వారి పిల్లలను ప్రభుత్వేతర పాఠశాలల్లోనే చేర్పించడానికి ఎక్కువగ ఇష్టపడుతున్నారు. దీనికి కారణం కేవలం అక్కడి సిలబస్,విద్యాబోధన అనే చెప్పలేము. అక్కడి వసతుల లేమికూడ మరొక కారణమని చెప్పకతప్పదు.

ఇక నేడు ప్రభుత్వేతర పాఠశాలలు కొన్నిచోట్ల వీధికి ఒకటి మించి ఉంటున్నాయి. ఇవన్నీ వ్యాపార సూత్రముల మీదనే ఆధారపడి నడుస్తున్నాయని చెప్పలేం కానీ అధికశాతం మాత్రం వ్యాపార విస్తరణ దగ్గరనే ఆగిపోతున్నాయి. అధికశాతంలో మిగిలిన స్వల్పశాతం ప్రభుత్వేతర విద్యాసంస్థలు మాది ప్రత్యేక విద్యావిధానమని ప్రచారం చేసుకుంటూ మోకాలికి బోడిగుండుకు ముడిపెట్టాలని చూస్తున్నాయి. మరికొన్ని పిచ్చితగ్గించాం; తలకి రోకలి బండ కట్టండి అన్నట్లు ప్రవర్తిస్తున్నాయి. మరికొన్ని ముందుతరం సిలబస్ అంటూ శక్తికి మించిన సిలబస్ ను విద్యార్థుల తలమీద రుద్ది వారిని అయోమయంలో పడవేస్తున్నాయి.

నేడు కొన్ని విద్యాసంస్థలు "అత్యాధునిక విజ్ఞానబోధనతో గురుకుల సంప్రదాయ విలువలుగల విద్యాసంస్థ మాది" అని ప్రచారం చేసుకుంటున్నాయి. మరికొన్ని విద్యాసంస్థలు "గ్రేడులైనా ర్యాంకులైనా మేమే మిన్న మాకు సాటి మరొకరు సున్నా"అని ప్రచారం చేసుకుంటున్నాయి. ఇంకొన్ని విద్యాసంస్థలు "బట్టీలకు చరమగీతం పాడి- దండనను ఖండఖండాలు చేసిన విద్యాసంస్థ మాది"అని ప్రచారం చేసుకుంటున్నాయి. ఇలా విద్యావిధానంలోని పాతపద్ధతులను మేమే పాతిపెడుతున్నాం అన్నట్లు నేటి ప్రభుత్వేతర పాఠశాలలు ప్రవర్తిస్తున్నాయి.

అయితే విద్యార్థులను రేపటి సమాజానికి ఉపయోగపడే ధీరులుగ ఎలా తీర్చిదిద్దాలి. వారి నిజజీవితానికి ఉపయోగపడే విద్యను ఎలా అందించాలి అన్న శాస్త్రీయ మార్గానికి అనుకూలంగ తమ తమ పాఠశాలల్లో విద్యావిధానాన్ని ఎంతమంది రూపొందించుకుంటున్నారంటే, అలాంటివారు స్వల్పాతిస్వల్పం అని చెప్పక తప్పదు. పదిమంది పిల్లలు అధికంగ చేరితే చాలు, ఆ సంస్థల యాజమాన్యం మేమే రాజులం; మేం చెప్పిందే శాసనం; మేం చేసిందే ధర్మం అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. అది చూసిన కొందరు మేథావులు పెరుగుట విరుగుట కొరకే అని సరిపెట్టుకుంటున్నారు.


నేడు విద్యార్థుల తలిదండ్రులు తమ బిడ్డలను ప్రభుత్వేతర పాఠశాలల్లో చేర్పించేటప్పుడు ఆయా పాఠశాలలు కల్పించే వసతులగురించి తెలుసుకుంటున్నారు. ఆ తర్వాత ఆ పాఠశాలకు వెళ్ళి ప్రత్యక్షంగ చూస్తున్నారు. ఇదెంతో హర్షించాల్సిన అంశము. అయితే వసతులంటే పెద్దపెద్ద భవనాలు, ఏ.సి రూములు మాత్రమే కాదని గ్రహించడం లేదు.

పాఠశాల భవనములు అంతస్తు మీద అంతస్తు ఇలా నాలుగు లేదా అయిదు అంతస్తులున్న భవనాన్ని అసలు విద్యాభవనంగ పరిగణించరాదు. ఇలాంటి భవనాల్లో విద్యార్థులు చదవడం వలన వారికి అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. మూడూ నాలుగూ అయిదూ అంతస్తుల్లో చదివే విద్యార్థులకు ముందుగ మోకాళ్ళ నొప్పులు వస్తాయి. తరువాత ఊపిరితిత్తులకు సంబంధించిన రోగాలు వస్తాయి. భవనానికి లిఫ్టు సదుపాయం ఉన్నప్పటికీ అవి సక్రమంగ సకాలంలో పనిచేస్తాయని చెప్పలేం; అంతేగాక పరిశుభ్రమయిన గాలికూడ విద్యార్థులకు అందదు. నిత్యం ఏ.సి గదుల్లో ఉండే విద్యార్థుల ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉంటుంది. కాబట్టి తలిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలి. పాఠశాల భవనాలు రెండంతస్తులు మించి ఉండరాదు. విశాలమయిన ఆటస్థలముతో రెండతస్తులతో ఉండే పాఠశాల భవనాలు విద్యార్థుల విద్యాభ్యాసానికి సదా శ్రేయస్కరమయినవి.

ఇక తరగతి గదుల విషయానికి వస్తే, శాస్త్రీయ విద్యాబోధనకు అనువయిన తరగతి గదులు భారత దేశంలో 99.99 శాతం లేవనే చెప్పాలి. నేడు కొన్ని పాఠశాలల్లోని తరగతి గదుల్లో I.R బోర్డు, బ్లాక్ బోర్డు, రకరకాల సబ్జెక్టుల చార్టులను అతికించడానికి కావల్సిన బోర్డులు ఉంటున్నాయి. అలాగే ప్రొజెక్టరు ఉంటుంది. విడివిడిగ రకరకాల ల్యాబ్ లు ఉంటున్నాయి. అయితే శాస్త్రీయ విద్యాబోధన రీతి తెలియక ఇవన్నీ ఎక్కువ నిరుపయోగానికి గురవుతున్నాయి.

అసలు తరగతి గది ఎలా ఉండాలి అన్న విషయానికి వస్తే, ఉదాహరణకు 30 మంది విద్యార్థులకు కావలసిన తరగతి గదిలో పైన చెప్పినవన్నీ ఉండాలి. తరగతిగదిని ఆనుకుని చిన్నగది ఉండాలి. ఇందులో ఆయా తరగతి విద్యార్థులకు కావల్సిన సామాగ్రి మొత్తం ఉండాలి. ఈ సామాగ్రినంత ఉపయోగించేటట్లుగ ఉపాధ్యాయులకి తగినంత శిక్షణనివ్వాలి. ఉపాధ్యాయులు విద్యార్థులచేత ఈ సామాగ్రిని ఉపయోగింపచెయ్యాలి. విద్యార్థులు ఆయా సామాగ్రిని ఉపయోగిస్తూ పాఠ్యాంశాలను నేర్చుకోవాలి.

తరగతి గది నమూన:---



ఉదాహరణకు ఒక భాషా బోధకుడు ఒక పాఠాన్ని బోధించాలంటే, ముందుగ పాఠం స్వభాన్ని గుర్తించాలి. స్వభానికి అనుకూలమయిన రీతిలో పి.పి.టి లేదా లఘు చిత్రం, చార్టులు వంటి సామాగ్రిని సమకూర్చుకోవాలి. అలాగే పాఠానికి తగిన కార్డులను సమకూర్చుకోవాలి. కార్డుల వెనుక పాఠ్యాంశ విషయాన్ని భద్రపరచాలి. ఇలా సమకూర్చుకున్న సామాగ్రినంత చిన్నగదిలో ఉంచుకోవాలి. తరువాత బోధనా సమయంలో సామాగ్రినంత విద్యార్థుల ముందు ప్రదర్శించి బోధిస్తూ, వారిలో ఉత్తేజాన్ని నింపాలి. అలాంటి సామాగ్రే వారిని తయారుచెయ్యమని ప్రోత్సహించాలి. సామాగ్రి తయారిలో విద్యార్థులను గ్రూపులుగ విభజించాలి. సామాగ్రి తయారిలో వారు చేసే పనులను నోడ్సుగ వ్రాయించాలి. లేదా కంప్యూటర్ లో భద్ర పరిచేటట్లు చెయ్యాలి. ఈ విషయమే వారికి పరీక్షలలో ఉపయోగపడుతుంది.

సామాగ్రి తయారుకు కావల్సిన వస్తువులను ముందుగానే సేకరించి చిన్నగదిలో ఉంచుకోవాలి. విద్యార్థులు ఉపాధ్యాయుడు చెప్పిన పాఠాన్ని విని, సామాగ్రిని చూచి, మరో కొత్తకోణంలో సామాగ్రిని తయారుచెయ్యాలి. అలా చెయ్యకుంటే, ఉపాధ్యాయుడు చూపిన సామాగ్రి,బోధన వ్యర్థమవుతుంది. సామాగ్రి తయారుచేస్తే, విద్యార్థి పాఠ్యాంశలోతులను పరిశీలించినట్లవుతుంది. భాషాబోధనలో సామాగ్రి అంటే పర్యాయపదాలనానార్థాల అర్థాల పద్యాల తదితరవ్యాకరణాంశాల పి.పి.టి పట్టికలు లేదా లఘుచిత్రాలవంటివని గ్రహించాలి.ఈ సామాగ్రి తయారివలన విద్యార్థికి భాష మీద మీడియాకు సంబంధించిన అనేక అంశాల మీద మంచి పట్టు వస్తుంది. ఈ పట్టు అతని జీవనోపాధికి ఉపయోగపడుతుమ్ది. అలాగే చార్టులు మొదలయినవికూడ ఈ కోవకే వస్తాయి. పాఠ్యాంశ లఘునాటికలు- విద్యార్థుల ప్రదర్శన వంటివికూడ ఇందులో తీసుకోవచ్చును. ఈ సామాగ్రంత తరువాత సంవత్సర విద్యార్థులకు ఉపయోగ పడటమేగాక వారు మరింత లోతయిన అద్యయనంతో క్రొత్త సామాగ్రిని తయారుచేసేటట్లు సామాగ్రి ఉండాలి. అన్ని సబ్జెక్టులలో ఈ పద్దతిని అనుసరించాలి

గణితంవంటి సబ్జెక్టులను బోధించేటప్పుడు ఆయా గణితశాస్త్రవేత్తల పరిశీలనా విధానం, వారనుకున్నది సాధించిన విధానం పి.పి.టిల ద్వారా లేదా లఘుచిత్రాలద్వారా చూపించాలి. అప్పుడే విద్యార్థి మరో గణిత సూత్రకల్పనకు శ్రీకారం చుడతాడు. ఇలా బోధనజరిగిన తరువాత అవసరాన్నిబట్టి ఆయా లాబ్స్ కు వెళితే ప్రయోజనం మరింత శాస్త్రీయంగ ఉంటుంది. ఇదే అసలు సిసలయిన తరగతి గది. ఆయా సందర్భాలను బట్టి తరగతిగదిని మరింత శాస్త్రీయంగ తీర్చిదిద్దుకోవాలి. ఇలాంటి తరగతి గదులలో జరిగే విద్యాబోధన సశాస్త్రీయపథాన పయనిస్తుంది.

ఇక విద్యార్థుల విషయానికి వస్తే ఒక్కొక్కరి మానసిక స్థితి ఒక్కొక్క విధంగ ఉంటుంది. అందరూ తరగతిగదిలో అభ్యాసానికి సంసిద్ధంగ ఉంటారని చెప్పడం సరయిన మాటకాదు. అయితే ఎలక్ట్రానిక్ పరికరాలద్వార విద్యార్థులందరూ, ఉపాధ్యాయుడు చెప్పిన బోధనాంశాలను భద్రపరుచుకునేటట్లు చెయ్య-వచ్చును. అలా భద్రపరుచుకున్న విషయాన్ని వారికి ఆసక్తికలిగినప్పుడు వినే అవకాశం ఉంటుంది. అలా వారిలో కొంత మార్పు రావచ్చును. అయితే విద్యార్థులలో మార్పనేది ఒకరోజులో వచ్చేదికాదు. ఇందుకు ఉపాధ్యాయుల, తలిదండ్రుల భాగస్వామ్యం అధికంగ ఉండాలి. అయితే తరగతి గదిని ప్రయోగశాలగ మలచగలిగితే ప్రతివిద్యార్థిలో అభ్యాస ఆసక్తి వేగంగ పెరుగుతుంది.

ఈ పద్దతిలో విద్యావిధానం సాగాలంటే ముందుగ ఆయా పాఠశాలల యాజమాన్యం చక్కని ప్రణాళికను రూపొందించుకోవాలి. ఈ రూపకల్పనలో తలిదండ్రుల పాత్రకూడ ఉండాలి. సీనియర్ విద్యార్థుల పాత్ర ఉంటే మరీమంచిది, ఆ తర్వాత ఉపాధ్యాయులు వారివారి సబ్జెక్టుల సామాగ్రిని తయారు చేసుకోవాలి. ఆ తర్వాతనే పాఠ్యాంశ బోధనకు వెళ్ళాలి. ఈ విధమయిన విద్యావిధానంలో ఉపయోగశాతం ఎక్కువగ ఉంటుంది. అన్నిటికంటే ముఖ్యమయిన విషయం విద్యార్థి స్థాయిని అనుసరించి పాఠ్యాంశాలు ఉండాలి. అలా ఉండాలంటే, ప్రభుత్వేతర పాఠశాలల యాజమాన్యం, తలిదండ్రులు, సీనియర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, హితాన్నికోరే మేథావులు ఒకచోట కలిసి సిలబస్ రూపొందించుకోక తప్పదు. ఇలా రూపొందించుకున్న సిలబస్ వలననే ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయి.

ఈ వ్యాసంతో పాటు నేను తయారుచేసిన కార్డులు, పి,పి,టి కూడ పంపిస్తున్నాను.